# ఆకాశము మరియు కుళాయి

## వల్లూరి రాఘవరావు

కుంభవృష్టిగా కురుస్తున్న వానను చూస్తూ భమిడిపల్లి దొడ్డమ్మ వసారాలో నిర్భాగ్యంగా గడుపుతున్నాను. ఆయేటి పరీక్షలు రాసి కొంత ప్రయోజకత్వం సాధించి ఆటవిడుపుకోసం గంగలకుర్రులోని మా దొడ్డమ్మ ఇంటికి జేరాను. ఆ రోజు ఎందుకో హఠాత్తుగా "అన్నయ్యా! ఆకాశములో ఏవన్నా కుళాయిలు ఉండునా?" అంటూ ప్రశ్నించాడు నా తమ్ముడు పురుషోత్తమ శర్మ.

"ఎంచేతా అలా అనిపించింది?" అడిగినాను.

"కుళాయిలను సాధనములే లేకున్నా నీరు వచ్చుట ఎలా సాధ్యము? ఎప్పుడైనా నీరు జిమ్మ కుళాయిని తిప్పిన దొడ్డమ్మ చావబాదేది. మంగళకరమైన ఆ దృశ్యాన్ని చూడనిచ్చింది కాదు. ఇప్పుడు ఆకాశంలో ఎవరు కుళాయి తిప్పి ఉంటారు? ఆ తిప్పినవాడిని పిర్ర బద్దలుకొట్టే దొడ్డమ్మ ఎక్కడుంటుంది?" ఇలా వాడు నోటికొచ్చినట్టు ప్రేలసాగాడు.

ఇంతాచేసి నాకన్నా ఏణ్ణార్థం తక్కువున్న ఈ వెధవకు ఇలాంటి ప్రమాదకరమైన సందేహాలు వచ్చుట నాకు రుచించలేదు. చిన్న అయినా, పెద్ద అయినా జ్ఞానమునకు ఓ హద్దు ఉండాలి కదా?

"నీ శార్థ్రం ... నా పిండాకూడూ! ఆకాశమున కుళాయిలేమిటి? కుళాయిలనునవి భూమిపై బిగించే సాధనాలు! జటావల్లభుల లక్ష్మీనారాయణ శర్మగారిని ఎరుగుదువా? సయిన్సు పాఠవ చెప్పుటలో దిట్ట! వారి తరగతిలో అడుగు. అందాకా నీకు ఇంత జ్ఞానము అనవసరం!" అని గసిరాను.

"పోనీ, వొకవేళ నేలమీద గల కుళాయిలే తలలు పైకెత్తి ఆకాశముపై బడి మరలా వెనక్కు వస్తున్నవంటావా?" అడిగాడు శర్మ.

"పైకి పోయిన నీరు కిందకెట్లు వచ్చురా దౌర్భాగ్యుడా?"

"భూమిలో ఏదో అయస్కాంతమువంటిది ఇలాంటి పని చేయుస్తుందంటావా?"

"అట్లా అని నీ కెవరు చెప్పారు?"

"అలా అనిపించి అన్నాను. అంతే!"

'పైకి పోవునవన్నీ కిందే పడునని న్యూటను కనిపెట్టే వరకూ ఎవరికీ తెలియదు కదా! వొకవేళ వీడు ఆ సంగతి ఎరిగే నన్ను ....? .. "నీకు న్యూటను తెలుసా?" అడిగాను.

"ఇంటిపేరు, గోత్రము తెలవదు. న్యూటను బ్రాహ్మడేనా?" ఎదురు అడిగాడు.

"కావచ్చు. అయితే, ఇంటిపేరూ, గోత్రం నాకు తెలియదు. సాంఘికశాస్త్రం చెప్పే ఇమాన్యుయేల్‌ను అడుగు, తెలుస్తుంది!" అంటూ మా శర్మగాడిని వదిలించుకోదలిచాను. వాడి దుంపతెగ ఇంత చిన్న వయసునే ఎన్ని ఆరాలు వాడికీ?

మరలా వాడేదో అడుగుటకు నోరు విప్పేలోగా క్రీచుక్రీచుమను శబ్దంతో వాకిలి ముందు ఓ ముసలి గుర్రము పూన్చబడిన బ్రూహాముపెట్టి బండి ఆగినది. రుసరుసలాడుచూ కొన్ని కాగితపు దొంతరల కట్టతో మా పెదనాయన బ్రూహాము పెట్టెబండి నుండి కిందకి దూకినాడు. యెకాయెకిన ఇంటిలోనికి చొరబడ్డాడు.

"ఏమిరా, మ్లేచ్ఛపు పీనుగుల్లారా? వసారాలో జేరి తమాషా చూస్తున్నారా ఏం? ఏ పడిశమో పట్టి వూష్టం కమ్మితే ... లస్డీ కొడుకుల్లారా... ఇక మారకమే! నడవండి లోపలికి!" అంటూ చెరోఱెక్కా పుచ్చుకుని మమ్మల్ని లోపలికి ఈడ్చినాడు.

అసలే ఆ దినం ఏదీ తోచక నేస్తులు కలవక కలవరపడుతున్న నాకు మరోసారి కడుపు మండినది. ఏం చెయ్యను? పెద్దముండావాడు ... చేతిని ఆ మట్న కరిచిన మా పెదనాయనకు మారకమే కదా? నిభాయించుకుని ఏం చెప్పాలో తెలవక కిరకిరమని గొంతు సవరించుకుని తల వొంచుకున్నాను.

ఇంత త్రాష్టం జరుగుతున్న సంగతి ఎరగనివాడైన నా తమ్ముడు తన జ్ఞానపిపాస ఆపుకొనలేక "పెదనాయనా! న్యూటను బ్రాహ్మడా? ఆకాశమున కుళాయిలు అతడే ఏర్పాటు చేసినాడా? ఈ సంగతి ఇమాన్యుయేలుకు తెలుసా? అన్నయ్య నడిగిన చికాకు పడుతున్నాడు...." అంటూ పితూరీ చేశాడు. అంతట వాడి వీపు బద్దలైపోయింది.

"నీ శార్థ్రం! పిల్లిపిత్తర గుంటకానా... ఏవి చదువులురా



> "చిన్నవయసులో పెద్ద ప్రశ్నలు? ఇలాంటివి నాకెందుకు రావు? మా తమ్ముడికే ఎందుకొస్తాయి? ఇంతకీ న్యూటను ఎవరు? బ్రాహ్మడేనా...?"


మీవి?" అంటూ ఇద్దర్నీ చావిడి బల్లమీదకు తోశాడు.

ఈ అలికిడికి వంట గదిలోంచి మా దొడ్డమ్మ బయటకు వచ్చింది. "మళ్లీ ఏం మేళం? పిల్ల సన్నాసుల నెందుకు వేధిస్తారు?" అంటూ గయ్యిమంది.

మా పెదనాయన ఒక్క క్షణం స్తబ్దమైపోయినాడు. "ఈ మేళానికేంలే? మధ్యాహ్నం మళ్లీ కచ్చేరీకి వెళ్లాలి. పిండం వండితే పారేయ్!" అన్నాడు విసుగ్గా.

"దానికేం లోటు? నడవండి!" అంది.

పనసపొట్టు కూరను వేడి వేడి అన్నంలో కలిపి లొట్టెడు కాచిన నెయ్యి అందు కలిపి నిజంగానే పిండములంత ముద్దలు చేసి ఎగబడి తినసాగాడు



మా పెదనాయన. మధ్యమధ్య ఎర్రగా వేగిన గుమ్మడికాయ ఒడియాలు ఫటా ఫటా నములుతూ.

"యేవిషో ... పొద్దుటిషుండీ వెడవ్వర్షం! కురవదు, వెలవదు! ఏదీ... ఓ వడియం వొడ్డించు!" అంటూ కరకరమని తినసాగాడు.

దూరం నుంచి చూస్తున్న మా మీదకు రెండు పిండి వడియాలు విసిరేసి "కాస్సేపు దవడలాడించండి, నాయనా! పెద్దాయనది కాగానే, కాస్త చారేసుకుని తిందురు!" అంది మా దొడ్డమ్మ.

కరకరలు చిరచిరలు త్రేన్పులు బేవరింతలు ఎక్కిళ్లు గటగట నీళ్ల శబ్దాల మధ్య మడుపల్లివారి రైసుమిల్లు శబ్దాలు తలపింపజేస్తూ భోజనం కానిచ్చాడు మా పెదనాయన. అంతట కర్పూర సుగంధం కలిపిన వొక్కపొడి గుప్పెడు లపీమని నోట్లో కొట్టుకుని పుయ్యాల బల్లమీదకు జేరినాడు. ఆనాటి పత్రిక చదువుతుండగా ...

"ఏం బావగారూ! బోయినం అయ్యిందీ...!" అంటూ ఆరా తీస్తూ ప్రవేశించాడు గోటేటి వెంకట్రావు కరణం.

"ఏఁవిటో సంగతి? కరణానికి మా ఇంటిపై కన్నుపడింది!" అంటూ వంటికింది వక్కచెక్కను ఫటుక్కుమనిపించాడు పెదనాయన.

"ఏమున్నది బావగారూ! జమాబందీలు సరిహద్దు తగూలూ ... ఆ మునసబుగాడి తిక్క పనులూ ... ఛీ!ఛీ! కరణం పనికన్నా కాకిపని మేలు!" అంటూ తల వెనక్కి చేతులు మడిచి కొయ్య కుర్చీలో కూలబడ్డాడు.

"అవును గానీ, మీ బ్రూహామ్ పెట్టెబండి యెంత పడిందేమిటి? వైదికుల్లో రాజసం అంటే మీదే!" అని అనవసరంగా పొగడసాగాడు.

"యెంతోయ్ ... నూరు నొక్క పాతిక బండికి, రెండొందలు గుర్రానికీ పడ్డాయి. అదిన్నూ ఓ తెల్లదొరగాడి ముండదగ్గర రెండోచేతి పైకానికి కొన్నాను!" అన్నాడు పెదనాయన.

ఇంగువచారులో ఊరమిరపకాయ కొరుక్కుంటూ వాళ్ల వైనాన్ని చూడసాగాను.

"అవును, కరణం! జస్టిస్ వాంఛూ రిపోర్టు చదివావూ? తంజావూరు ప్రాచ్య భాండాగారంలోని తాళపత్రాలు ఆంధ్రాకు కూడా వాటా వేసి ఇవ్వాలని చెప్పాట్ట కదూ? 'త్రిలింగ ప్రజామాత'వాడు రాశాడు ఈ మాట. చూశావూ...!" అన్నాడు.

"ఎవడి వాటా ఎంతైన ఏమిటి లాభం? మనవాళ్లల్లో చదువరులు ఎందరు? అంతా నాటకం!" అన్నాడు కరణం.

ఇలా మధ్యాహ్నం పొడవునా లోకప్రయోజనకరమైన పలు విషయాలు వారు చర్చించినారు. నాలుగు కావస్తుండగా మా దొడ్డమ్మ వాళ్లకి ఓ తీపి, ఓ కారము ఫలహారంగా ఇచ్చింది. వాటిని తిని, గంటచెంబు కాఫీ కానిచ్చి ఇద్దరూ లేచారు.

"ఒసేవ్...! నా కోసం ఎవరైనా వస్తే, ఇక రేపే రమ్మను!" అంటూ ధోవతీ సవరించుకు లేచాడు పెదనాయన.

"ఎందాకా పయనం?" అడిగింది మా దొడ్డమ్మ.

"ఎక్కడికమ్మా... ఆనందవిలాస సభ వరకూ పోయి కాస్సేపు కాలక్షేపం చేసి బావగారిని పంపేయునా?" సాగదీసాడు కరణం.

"ఇంట్లో పిల్లలున్నారు, ఏ బొంబాయి హల్వానో, బాదం పలుకులో తెండి!" అని పురమాయించింది మా దొడ్డమ్మ.

ఇద్దరు కిర్రుకిర్రుమను శబ్దంతో నడిచిపోయారు.

సంధ్యవాలింది. చీకటి వెలుగుల దోబూచులాటలో ఆకాశము వెర్రిగా కనబడసాగినది.

నెమ్మదిగా మా తమ్ముడి దృష్టి తప్పించి నేస్తులతో కలిసేందుకు బయటపడ్డాను. యెకాయెకి జొన్నలగడ్డ సీతామహాలక్ష్మి అను నా నేస్తు ఇంటికి జేరాను. వీణపాఠము పూర్తిగావించుకుని కొబ్బరిచెట్టు కింద కూర్చుంది అది.

మా సీతా, నేనూ ఒక తరగతివారమే. ఒకరి కష్టములు వొకరికి చెప్పుకుని ఊరడిల్లేవారము. ఆ సాయంత్రము మా కబుర్లు ఆకాశపు కుళాయిమీదికి మళ్లాయి. మా తమ్ముడి వాంగ్మూలాన్ని చెప్పగా అది పడీపడీ నవ్వినది.

"అసాధ్యుడిలా ఉన్నాడు. ఏం చెప్పావేం?" అడిగింది ఆసక్తిగా. జరిగింది చెప్పాను. మళ్లీ నవ్వింది.

"ఎందుకా ఇకిలింత? పోనీ, నీకు తెలిస్తే చెప్పరాదూ!" ఉడుకుగా అన్నాను.


"ఇలాంటి సందేహమే నాకూ వస్తే మా పింతల్లిని అడిగాను. పెద్దాళ్లే చెప్పగలరు. ఇది చాలా పెద్ద ప్రశ్న. చిన్నవాడని శర్మను తీసిపారేయకు!" అంది.

"చిన్నవయసులో పెద్ద ప్రశ్నలు? ఇలాంటివి నాకెందుకు రావు? మా తమ్ముడికే ఎందుకొస్తాయి? ఇంతకీ న్యూటను ఎవరు? బ్రాహ్మడేనా...?" ఎన్నో ప్రశ్నలతో బుర్ర గిర్రుమంది. సీతతో కాస్సేపు గవ్వకచ్చాలు, తిరుగుడుగుళ్లూ ఆడి అలసి ఇంటికి చేరాను. పెద్ద ప్రశ్నలు నాకెందుకు రావన్న బాధతో జరం వొచ్చేసింది. ఒకటే నలత ... ప్రశ్న పోతే పోనీ, జవాబు అయినా తెలవాలిగా? ఇంతకీ ఇమాన్యుయేల్ ఈ వైనం గురించి చెప్పగలడా?

చదువు వృథా, జ్ఞానం వృథా, ఊరమిరపకాయలు వృథా, దొడ్డమ్మ వృథా, సీతతో నేస్తం వృథా? అసలు న్యూటను ఎవడైతే నేమిటి? వాడికే ఈ సంగతి ఎలా తట్టింది? బ్రాహ్మలకి తప్ప అన్యులకు తట్టని ఇట్టి పరిష్కారాలు ఎవరికైనా ఎలా దొరుకుతాయి? బ్రూహముబండిలో ఉన్న మజా ఏమిటి? తెల్లదొరగారి ముండ ఎందుకు రెండో చేతి ధరకు అమ్మింది? తంజావూరు భాండాగారంలో మన వాటా ఎవరికి ఇస్తారు? అసలీ లోకంలో కరణాలతో నిమిత్తం ఉందా? .... పొద్దుటినుంచి జరిగిన భాగోతముతో నా బుర్ర వేడెక్కిపోయింది. ఏదీ తట్టని స్థితి నెలకొన్నది. ఈ రోజు ఎందుకిలా అయినది?

మిక్కిలి చింతాక్రాంతుడనై చావిడి బల్లమీద కాలుమీద కాలేసుకుని పడుకుని యోచిస్తుండగా మా దొడ్డమ్మ వచ్చింది.

"ఏమిరా భడవా? మీ పెదనాయన భంగిన ఏదో తలపోస్తున్నావు?" అంటూ నెత్తిమీద మొట్టింది.




"దొడ్డమ్మా! నాకు నా తమ్ముడిలా పెద్ద ప్రశ్నలు ఎందుకు రావడంలేదు? చాలా బాధగా ఉంది!" అన్నాను. ఆకాశంలో కుళాయి వైనం దొడ్డమ్మకి చెప్పాను.

మా దొడ్డమ్మ ఫెళ్లున నవ్వేసి ఇలా అంది "ఈసారి యెండాకాలంలో దీన్ని గురించి యోచించు. ఎండ వేడికి ఏమవుతుంది? నోట్లోంచి నీళ్లు తాగి వుచ్చ యెలా పోస్తావో అలానే ఇదీనూ! వేసంకాలమంతా ఆకాశం నీళ్లు తాగి వానాకాలంలో వుచ్చపోస్తుంది. అంతేరా భడవా!" అంది.

"మరి ఈ సంగతి నీకన్నా ముందు న్యూటను కెలా తెలిసింది? అతగాడు ఎవరు? అతడు కనిపెట్టక పూర్వం పైనవి కిందపడటంలేదా?" అని అడిగాను.

"న్యూటనో గూటనో ఎవడైతేనేమి....? తెల్లబ్రాహ్మడు అయి ఉంటాడు. కాకపోయినా నీకేం నష్టం? వానలు బ్రాహ్మలమీదే పడవు కదా? మీ పెదనాయన బ్రాహ్మడే! ఏవిటి ప్రయోజనం? వాన కురిపించగలడా, ఆపగలడా?" అంటూ ప్రశ్నించింది.

మా దొడ్డమ్మ నా తమ్ముడికన్నా, నాకన్నా చాలా పెద్ద జ్ఞానిగా గోచరించింది. ఎవరినన్నా నోరు మూయించాలంటే.. అంతకన్నా పెద్దవి అర్థమే కానివి ప్రశ్నలు ఎదుటివారిని వేసిన కొంత ఉపశమనం లభించును. ఈ యోచనలో ఉండగానే మా దొడ్డమ్మ నా ముఖంపైకి దుప్పటిలాగి "పడుకోరా, నచికేతా!" అని నవ్వుకుంటూ పెదనాయన గదిలోకి వెళ్లినది.

ఇప్పుడు దొడ్డమ్మ ఈ వైనాన్ని అంతా పెదనాయనతో చెబుతుందా? చెబితే ఆయనేం చెబుతాడు? ఆసక్తి ఆగక మట్టసంగా ఉన్న కొయ్యతలుపు కన్నానికి చెవి ఆన్చినాను.

దొడ్డమ్మ పకపకలాడింది. పెదనాయన మాటలు వినబడలేదు. ఏదో చేయరానిది చేస్తున్న అలికిడి మాత్రం అయి ఆ కన్నపు స్థలమున చెవి తీసేసి కన్ను పెట్టినాను. ఇద్దరూ గవ్వగచ్చికలాటవలె పొర్లాడుతున్నారు. నాకది నచ్చక వచ్చి నిద్రపోజొచ్చాను. ఉదయం నాకు కొన్ని కొత్త సందేహాలు వచ్చినవి. రాత్రి చూసిన ఉదంతం కరణం వెంకట్రావుకు చెప్పి ...

"చిన్నవారు అలా చేస్తే ఆట. మరి పెద్దవారు ఎందుకలా ఆడతారు? అదీన్నీ రాత్రివేళ...?" అడిగాను.

"హవ్వ...హవ్వ...! నీకేం పోగాలంరా భటాచోర్ వెధవ! అది ఆట కాదు!"

"మరి యేవిటి?"

"చివరకు వాళ్లను రాత్రిపైతమూ విషయించుకోనీయవా?" అని వీపుపై బాదాడు.

"విషయించుకోవడం అనగా?" ఆసక్తి చావక అడిగాను.

కన్నీళ్ల పర్యంతం అవుతూ, నాకో దణ్ణం పెట్టి, "ఇప్పుడు మాటలతో నన్ను నువ్వు చేస్తున్నదే...!" అని విసవిస నడిచి వెళ్లిపోయాడు.

యేమి విషయించుకోవడమో యేమిటో? ఆటల్లో కూడా ప్రశ్నలే! బహుశా కాస్త ప్రాజ్ఞుడనైతేగానీ దీనికి సమాధానం నాకు తట్టదు. అంతవరకూ నేను సందేహములతో విషయిస్తూ వుండాల్సిందే గామోసు! ■